# అగాధ నీలిమ

ఆకుపచ్చలోయల వెంట చిన్ని రైలు మెల్లమెల్లగా వెళుతోంది. పచ్చదనపు కొండల గుబురుల్లోంచి లోయల్లోకి కనుమరుగవుతోన్న జలపాతాలు. మంచుతెరకు వెనక

మేఘమో వృక్షమో సూర్యకాంతో అంతా అస్పష్టమే. రైలు రైలంతా వుత్సాహపు వుప్పెనలా పొంగిపోతోంది.

నీలిమ కళ్ళ ముందు దృశ్యాలు ఎనీమిక్‌గా.

రైలు ఆగింది. వుప్పెన నేల మీదకి దుమికింది. ఆమె మాత్రం కిటికీకి అతుక్కుపోయి కూర్చుండి పోయింది.

రైలు కూతవేసింది. కూసికూసి అలసిపోయి రైలు కదిలేవేళ లోయల్లోంచి చెట్లలోంచి నీటి చెలమల్లోంచి అంతా బిల బిలమంటూ రైలెక్కారు.

రైలు కొద్దిదూరం వెళ్ళింది. జల్లులు జల్లులుగా వర్షం. కంపార్ట్‌మెంట్ ముందు కూర్చున్న టి.టి.ఐ. నల్లగొడుగుని తలమీద కప్పుకున్నాడు. డ్రైవర్ రైలుని ఆపాడు. అంతా రైల్లోంచి దూకారు. జల్లుల్లో జాజిపూలైనారు. అయినా నీలిమ రైలు దిగలేదు.

ఆగుతూ, ఆగుతూ రైలు ఉదకమండలం చేరింది. అంతా రైలు దిగి యెవరి సామాను వాళ్ళు తీసుకొని స్టేషన్ బయటకి వచ్చారు.

లెక్చరర్స్, స్టూడెంట్స్ అంతా వున్నారో లేరో సరి చూసుకున్నారు. అంతా తమిళనాడు టూరిస్ట్ హోమ్‌కి వెళ్లారు యెవరి గదుల్లోకి వాళ్లు చేరుకున్నారు.

నీలిమ స్నానానికి వెళుతుంటే 'డైనింగ్ హాల్‌కి వెళ్ళొచ్చి చేయొచ్చుగా. యింకా ఆలశ్యం అయితే లంచ్ దొరకదేమో' అంది స్వాతి.

'నో, ముందు స్నానం చెయ్యాలి' అంది నీలిమ.

'నే వెళ్ళి నీక్కూడా లంచ్ వుంచుతాను. స్నానం చేసి త్వరగా రా' అంటూ స్వాతి వెళ్ళిపోయింది.

తలుపుకి బోల్టు పెట్టి నీలిమ స్నానానికి వెళ్ళింది.

* * *

సాయంత్రం ఆరవుతోంటే జివ్వుమంటూ మంచుగాలి కాశ్మీరీ శాలువాని భుజాల చుట్టూ కప్పుకొని నీలిమ కారిడార్‌లో నడుస్తోంది. స్టూడెంట్స్‌తో కలిసి స్వాతి వూరి వీధులని పలకరించాలని వెళ్ళింది. నీలిమకి బయట తిరగాలనే వుత్సాహం కలగలేదు. కారిడార్ దాటి లాన్‌లోకి వచ్చింది. అక్కడక్కడా సిమెంట్ బెంచీలూ వుయ్యాలలూ జారుడు బల్లలూ. పిల్లలు వూగుతున్నారు. జారుతున్నారు. వో బల్లపై కూర్చుని వాళ్లవైపు చూస్తోంది. పాప యెలా వుందో?

అమ్మమ్మ దగ్గర పాపకి అలవాటే కానీ పనులపై బయటకి వెళ్లినప్పుడు కేర్ సెంటర్లో వుంచితే పాప యేడుస్తుంది. పాపని వదలి రాకుండా వుండాల్సింది. అనీజిగా వుందామె మనసు.

నీలిమ వివాహం అట్టహాసంగా గోవర్ధన్‌తో జరిగింది. అతను బ్యాంక్ ఆఫీసర్. ఆ పెళ్లిలో అన్ని వేడుకలు ఠంచనుగా జరిగాయి. పెళ్లి అయ్యాక గోవర్ధన్ యింటికి వచ్చాక నీలిమకి అంతా అయోమయంగా అనిపించింది. గోవర్ధన్‌కి అన్ని పనులు టైమ్‌కి జరగాలి. నిద్ర లేవటం బ్యాంక్‌కి వెళ్లటం భోజనం పూజ స్నానం శృంగారం- అన్నీ టైమ్ ప్రకారం జరగాల్సిందే. రాత్రిపూట నీలిమని కౌగిలించుకునే వేళ కూడా వాచ్ తీయడతను. యింత టైమ్ సెన్స్ వున్న గోవర్ధన్ బ్యాంక్‌కి బయలు దేరినప్పుడు వచ్చే 'యెదురు' విషయంలో చాల పర్టిక్యులర్‌గా వుంటాడు. పిల్లి తెల్లచీర బట్టలమూట లాంటివి యెదురైనప్పుడు అతను స్కూటర్ స్టాండ్ వేసి యింట్లోకి వచ్చి దేముని మందిరం ముందు నిలబడి చేతులు జోడించి లెంపలేసుకొని కానీ బయటకి వెళ్లడు.

'హలో మేడమ్ వ్వాటే సర్‌ప్రైజ్' అని వినిపించగానే తలతిప్పి చూసింది నీలిమ.

వెంటనే గుర్తుపట్టలేక పోయింది.

'మీరు నన్ను గుర్తుపట్టలేదు. మీరూ కావేరిగారు ఫ్రెండ్స్ కదా. మీరోసారి మా ఆఫీసుకి వచ్చారు' అన్నాడు.

'అవునా? మిమ్మల్ని కావేరి పరిచయం చేసిందా' అడిగింది నీలిమ.

'లేదు. నాకే మీరు గుర్తున్నారు. యెప్పుడొచ్చారు' అడిగాడతను.

'యీరోజే'

'ఫ్యామిలీతో వచ్చారా' అడిగాడు.

'నో. మా స్టూడెంట్స్‌తో బొటానికల్ టూర్. మీరు ?'

'వెకేషన్'

'వెకేషన్? వొక్కరూ'

'ఆ ప్రతియేడు వో పది, పదిహేను రోజులు వెకేషన్‌కి పెట్టుకుంటాను. యిలా యెక్కడెక్కడికో వెళుతుంటాను. మీరే రూంలో వున్నారు'? అడిగాడు.

'214' అందామె.

'డిన్నర్‌కి వస్తారా' అడిగాడు.

నీలిమ యేమనాలో తోచని స్థితిలో తలూపింది.

'రండి'

యిద్దరూ బయటకి వచ్చారు. వొకరి పక్కన వొకరు. అతను స్వెటర్ వేసుకోలేదు.

'మీకు చలివేయటం లేదా' అడిగింది.

'వేస్తుంది యేం'

'మరి స్వెటర్ లాంటిదేం వేసుకోలేదేం'

'స్వెటర్ వేసుకు తిరగటానికి యిక్కడివరకూ రావటం యెందుకు? యీ చలిని యిలానే యెంజాయ్ చేయాలనిపిస్తోంది' అన్నాడు.

'యిందులో తిందామా' అడిగాడు వో రెస్టారెంట్ చూపిస్తూ.

'యిక్కడ నాకేం తెలియదు. మీ యిష్టం'

'నాకూ యీ రెస్టారెంట్ గురించి తెలియదు. వోసారి తెలిసిపోయిన రెస్టారెంట్‌లో మళ్లీ మళ్లీ తినాలనిపించదు. యిలా కొత్త కొత్త ప్రదేశాలని కనిపెట్టటం బాగుంటుంది' అన్నాడతను.

మెనూ కార్డు అందించాడు.

గోడ చుట్టూ చాపలు వేలాడుతున్నాయి. లో వెలుగు. గట్టిగా వినబడుతున్న తమిళ పాటలు.

'వెజిటేరియన్' అడిగాడతను.

అవునన్నట్టు తలూపిందామె.

'యిష్టం వుండదా' అడిగాడు.

'యెప్పుడూ తినలేదు'

'తినాలనిపించలేదా'

నాన్‌వెజ్ యెప్పుడైనా తినాలనిపించిందా? యేమో... నిర్లిప్తంగా వుండిపోయింది.

'ట్రై చేస్తారా' అడిగాడు.

ఆమెని వొక్కసారిగా అయోమయం ఆవరించింది. యేం చెప్పాలో

తెలియలేదు. యింట్లో మేం తినం అంటారు. యెందుకంటే గోవర్ధన్ యెప్పుడూ యిట్లా అడగలేదు.

'వోకె. మీకేం కావాలో ఆర్డర్ చేయండి' అన్నాడు.

'మీరు చేసేయండి'

'తినేది మీరు. నేనెలా ఆర్డర్ చేస్తాను?' అంటూ అతనికి కావలసినవి అతను ఆర్డర్ చేసుకున్నాడు.

గోవర్ధన్ యిలా యెప్పుడూ ఛాయిస్ యివ్వలేదు.

వుత్సాహంగా మెనూ కార్డు చదివి ఆమె తనకి కావలసినవి ఆర్డర్ చేసింది.

అతను తింటూ తింటూ మధ్యలో 'యిది చికెన్ 65 మీకు ఆసక్తి వుంటే టేస్ట్ చేయొచ్చు' అన్నాడు.

ఆమె ఆ ప్లేట్ వైపు చూసింది కానీ తింటానని అన్లేదు. తిననని చెప్పలేదు.

అతను బిల్లు యిస్తున్నప్పుడు ఆమెకి తను డబ్బులు తీసుకురాలేదని గుర్తొచ్చింది.

'సారీ. నేను డబ్బులు తీసుకురాలేదు' అంది.

'పాన్ వేసుకుంటారా' అడిగాడు.

'వద్దు' అంది.

టూరిస్టు హోమ్‌కి వచ్చారు.

'నే వెళతాను' అంటూ ఆమె గదివైపు వెళ్లింది.

అప్పటికే రూంలోకి వచ్చిన స్వాతి 'యెటు వెళ్లావ్' అడిగింది.

'వూరికే అలా తిరిగొచ్చాను'

'వొక్కదానివి'

'లేదు. కావేరి ఆఫీసులో పనిచేస్తారంట. ఆయన అనుకోకుండా కనిపించారు. అతనితో వెళ్లాను' మంచంపై ముడుచుకొని పడుకొంటూ చెప్పింది నీలిమ.

'కావేరి ఆఫీసులో అతనా? యేం పేరు'

స్వాతి వైపు బ్లాంక్‌గా చూసింది నీలిమ.

అతని పేరేంటి?

'యేమో అతనూ చెప్పలేదు. నేనూ అడగలేదు. పేర్లతో పనిలేదనుకుంటాను. అతని పేరు తెలియకపోయినా బాగానే మాట్లాడుకున్నాంగా' అంది నీలిమ.

స్వాతి బెడ్‌లైట్ వేసి పెద్ద లైట్ ఆర్పేసింది.

* * *

విశాలంగా పరుచుకున్న పచ్చిక. బొటానికల్ గార్డెన్స్ అంతా స్టూడెంట్స్. తిరిగి నోట్స్ రాసుకుంటున్నారు. తిరిగి తిరిగి సాయంత్రం రూంకి వచ్చారు. నీలిమ స్నానం చేసొచ్చి నిన్న కూర్చున్న చోట కూర్చుంది. లాన్‌లో డైనింగ్ రూంలో ఆమె కళ్లు అతని కోసం చూస్తున్నాయి. అతను కనిపించలేదు. బోటు క్లబ్ దగ్గరా అతను కనిపించలేదు.

యెక్కడ తిరుగుతున్నాడో?!

* * *

దొడబెట్ట దగ్గర టూరిస్ట్ వ్యాన్ ఆగింది. తెల్ల మేఘాలో మంచుతెరలో తెలియకుండా శరీరాన్ని అల్లుకుపోతున్నాయి. చల్లదనాన్ని తట్టుకోలేకపోతోంది నీలిమ. కాఫీ బండి వైపు నడిచింది. కప్పు కాఫీ తాగకముందే కోల్డ్ కాఫీ అయిపోతోంది. భుజాన వేలాడుతున్న సంచిలోంచి డబ్బులు తీసి కాఫీ అతనికి యిచ్చింది. వో పక్క సినిమా షూటింగ్ జరుగుతోంది. స్టూడెంట్స్ ఆవైపు వెళ్లారు. స్వాతి అవీ యివీ కొనే హడావిడిలో అటు యిటూ తిరుగుతోంది.

సూసైడ్ పాయింట్ వైపు వెళుతుంటే 'సూసైడ్ పాయింట్‌తో మీకేం పని? యితరులకి మీరా పని కల్పించాలి కానీ' అంటూ దగ్గరకి వచ్చాడు కావేరి స్నేహితుడు.

'మీ పేరేంటి' అడిగింది.

'నా గురించే ఆలోచిస్తున్నట్టున్నారు' అన్నాడు చిర్నవ్వుతో

అతని పేరు పట్ల తనలో వున్న ఆత్రుతకి ఆమె దొరికిపోయిన పూల దొంగలా నవ్వింది.

'చెప్పరా' అడిగింది.

'చెప్ప...రా' వొత్తిపలుకుతూ అన్నాడు.

'ఛ.ఛా అలా అనలేదు' కంగారుగా అందామె.

'ఆకులు, పువ్వుల పేర్లు రాయించేశారా మీ స్టూడెంట్స్‌తో' కాఫీ బండి దగ్గర ఆగుతూ అడిగాడు.

'చాలా వరకు'

'యింత బ్యూటిఫుల్ ప్లేస్ కొచ్చి మీరు వాళ్లని అలా చదువు చదువని చంపైటం యేం బావోలేదు' అన్నాడు వో కప్పు ఆమెకి అందిస్తూ.

'మేం మరీ అలా నొక్కి పెట్టేయటంలేదు. యీరోజు రాయించే పనేం లేదు. చూడటమే' అంది.

కాఫీ తాగి గ్లాసులు యిచ్చేసి యిద్దరు కాస్త ముందుకు వెళ్లారు. సూసైడ్ పాయింట్ చిట్ట చివరి అంచుకొనవరకు వచ్చాక 'నేను ఆ లోయలోకి వెళుతున్నాను' అన్నాడు.

'లోయలోకా' వొత్తైన పచ్చదనం నిండిన లోయని చూస్తూ ఆశ్చర్యంగా అడిగింది.

అవునన్నట్టు తలూపాడు.

'యెందుకు'

'ఆ లోయలో వో బ్రిటిషర్ వుంటున్నాడంట. చుట్టుపక్కల ఆదివాసీలతో మమేకమై జీవిస్తున్నారంటారు. వోసారి చూసొద్దామని. వస్తారా? ఆసక్తి వుందా' అడిగాడు.

'త్వరగా వచ్చేస్తామా' అడిగింది.

'చెప్పలేను' అన్నాడు.

నీలిమ స్వాతి దగ్గరకి వెళ్లింది. తమిళ యింగ్లీషు హిందీ భాషల్లో బేరాలు చేయటంలో తలమునకలవుతోంది స్వాతి.

'నేనా లోయలోకి కావేరి ఫ్రెండ్‌తో వెళుతున్నాను. త్వరగా వచ్చేస్తాను' నీలిమ చెప్పింది.

'కావేరి ఫ్రెండ్‌తోనా... ఆ. ఆ. వోకే. వోకే. త్వరగా రా. లేకపోతే నిన్ను యిక్కడే వదిలి మేం వెళ్లిపోతాం' అని అమ్మె అతనివైపు తిరిగి 'ఆ... సొల్లు...సొల్లు' అంటు బేరాల్లో బేజారెత్తి పోతోంది.

నీలిమ స్వాతి తమిళ పదాలని పలికే తీరుకి నవ్వుకుంటూ అతని దగ్గరకి

వచ్చింది.

కొండ మీద పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ నడుస్తున్నాడు. నీలిమ కొండ అంచు చివరి వరకూ వచ్చి ఆగిపోయింది. సన్నని కాలిబాటతో ఆ లోయల్లోకి దిగటానికి తటపటాయిస్తూ ఆగిపోయింది.

అతను వెనక్కి తిరిగి చూసి 'భయమా? మీరు భయపడేకొద్దీ లోయలూ భయపెడతాయి. వొక్కసారి దిగటం మొదలుపెట్టారా మీరే వో పెద్ద లోయలా వుంటారు. మిమ్మల్ని చూసి అవి 'బాప్‌రే' అనుకుంటాయి. కమాన్' అన్నాడు.

అతనికి జవాబు చెప్పే సాహసం చేయలేక అడుగు ముందుకు వేసింది. లోయలోకి దిగేకొద్దీ దిగటంలో మెళకువలు తెలుస్తున్నాయి.

నీలిమ స్వరపేటికలో కాసింత గతం.

పాపకి పుట్టెంట్రుకలు తీయించడానికి గోవర్ధన్‌తో కలసి వోసారి తిరుపతి వెళ్లింది. బంధువులూ వెంటవచ్చారు. అంతా టాక్సీలో కొండ మీదికి వెళ్లారు. దర్శనం అయిపోయింది. ఆరోజు సాయంత్రం కొండమీది పార్క్‌కి వెళ్లారు. పచ్చికలో పాప ఆడుకుంటోంది. పెద్దాళ్లంతా పాప దగ్గరే వున్నారు. నీలిమని పార్క్‌లో అటూయిటూ తిప్పుతూ గోవర్ధన్ ఫోటోస్ తీస్తున్నాడు. వో చోట లోయలోకి మెట్లు కనిపించాయి.

'చూద్దామా అదేంటో' అడిగింది నీలిమ

'యేమిటో తెలియదు కదా. వద్దులే. అసలే అడవి' అన్నాడు.

'చూద్దాం. తెలుస్తుంది కదా' అంది.

'యేమిటి చూసేది? పిచ్చితనం కాకపోతే? యిదంతా అడవి. దిగితే యేమైనా వుందా' చికాకుగా అన్నాడు.

'పోనీ. నీకు రావాలని లేకపోతే రావొద్దు. నే వెళతా'

'వద్దు'

'త్వరగా వచ్చేస్తా'

'వద్దన్నానా? ఎందుకలా విసిగిస్తావ్' గోవర్ధన్‌లో అసహనం.

గోవర్ధన్‌కి తెలిసిందే ప్రపంచం. ఆ ప్రపంచమే తనకి తెలిసివుండాలి. అంతేకాని కొత్తవైపు చూడడు. చూడనివ్వడు.

యితను యే ప్రపంచంలోకైనా దూకేట్టున్నాడే. రానంటే యేమంటాడో...

'నేనింక రాను'. అంది.

అతను ఆగి ఆమెవైపు తిరిగి 'రారా అడిగాడు.

'రాను' అంది

'సరే. రాకండి. యిక్కడుంటారా? పైకి వెళతారా' అడిగాడు.

'యిక్కడా? వూహూ...'

'పైకి వెళతారా?'

'వూ'

'పదండి'

'మీరెక్కడికి?'

'మిమ్మల్ని వదిలి వెనక్కి వస్తా'

'నే వెళ్లగలను'

'అలవాటు లేదుకదా. యిబ్బంది పడతారేమో'

యితనికి చికాకు రాదా... అనుకుంటూ - 'వద్దులెండి. వెళ్లగలను'

'మీకు వెళ్లగలననే గట్టి నమ్మకం వుంటే వెళ్లొచ్చు కానీ దారి తప్పితే చికాకు పడతారేమోనని...'

'వద్దులెండి. మీతోనే వస్తా'

'సరే వెళతా. మీరు పైకి వెళ్లండి'

'లేదు లేదు...' అని ఆగి... 'నిజానికి మీరేమంటారోనని అడిగా. అంతే. రావాలనే వుంది'

'నేనేమంటానోననా!'

నిశ్శబ్దం.

'అంటే...'

'ప్చ్... పదండి...' నవ్వుతూ అంది.

అతను చిన్నగా నవ్వి 'పరీక్షా...'

ఆమె గట్టిగా నవ్వేసింది.

అతను ముందుకు అడుగులేస్తూ చప్పున వెనక్కి తిరిగి 'యింతకీ విషయం చెప్పలేదు...'

'యే విషయం?'

'గెలిచానా? వోడానా?'

చెప్పనన్నట్టు నవ్వింది.

పచ్చని మంచులోయల మధ్య నుంచి నడుస్తూ వుంటే వొకే వొక్క యిల్లు కనిపించింది - పై కప్పు యేటవాలుగా.

అతను వాళ్లని పరిచయం చేసుకున్నాడు. ఆమెని పరిచయం చేశాడు. 'హలో' అనటం తప్ప ఆమె యేమీ మాట్లాడలేకపోయింది. అతను వాళ్లతో మాట్లాడుతున్నాడు.

అతను మాట్లాడటం అయ్యాక యిద్దరు తిరిగి కొండ మీదకి బయలుదేరారు. కొద్ది దూరం నడిచారో లేదో వలయాలు వలయాలుగా యెటుచూసినా మంచు. యెవరికి యెవరూ కనిపించటంలేదు. తెల్లని కొండలు. ఆమెకి ముందు యేముందో తెలియక నిలుచున్నచోటే ఆగిపోయింది. అతను ఆగిపోయాడు.

'యెంత సేపు యిలా' మాట్లాడటానికి నోరు తెరిస్తే నోరంతా మంచే.

'తెలియదు' అన్నాడు.

యిద్దరూ కాసేపు అలానే నిల్చుండిపోయారు. ఆమె చల్లదనాన్ని తట్టుకోలేకపోతుంది. ఆమె కప్పుకున్న శాలువా యెప్పుడో చల్లబడిపోయింది. ఆమె చిన్నగా వణుకుతోంది.

ఆమెకి చేరువుగా వున్న అతను తన వొంటిమీది పై కోటు తీసి ఆమెకి యిచ్చాడు. ఆమె కోటుని అందుకోవాలనుకుంది. కాని చేతులు వణుకుతున్నాయి. అతను ఆమె భుజాలమీద కోటుని కప్పుతుండగా ఆమె తల తిప్పింది. అతని పెదవులకి చేరువుగా ఆమె ముఖం.

మంచు పెదవుల్లోంచి రగులుతున్నజ్వాల. అతని పెదవులు ఆమె పెదవులని బిగించాయి. అతని చేతులు ఆమె భుజాల మీదుగా వీపు చుట్టూ తిరిగాయి. చల్లదనం నుంచి రాజుకుంటున్న సెగ. అతను చేతుల్లో ఆమె. మెడ యెత్తి ఆమె కళ్లల్లోకి చూశాడు. దట్టంగా మంచు. ధారలుధారలుగా మంచు చినుకులు. తడిసి ముద్దయిపోతున్న ఆకుపచ్చ షిఫాన్ చీర. టూబైటూ బ్లౌజు. శాలువా యెప్పుడో జారిపోయింది. నడుం చుట్టూ బిగుసుకుంటున్న అతని చేతివేళ్లు. జుట్టులోంచి సన్నని ధారలుగా నీళ్లు. ఆమె నుదిటి సింగార్‌తిలకం మంచుజల్లుకి తడిసి కరిగిపోయింది. యిప్పుడు చలి కూడా లేదు.

అక్కడే అలానే కింద వాలిపోయారు. వీపుకి గుచ్చుకుంటున్న మట్టి రవ్వలు. యిసుక రేణువులు. చిక్కని చీకటి. ఆమె చేతివేళ్లు అతని చేతిని నిమురుతూ సన్నటి పొడుగాటి అతని చేతివేళ్లను స్పృశిస్తూ అతని నడుం చుట్టూ తిరుగుతున్నాయి.

సముద్రగర్భం అట్టడుగున కలువ మొగ్గ. వొత్తైన నీలి జలరాశిని చీల్చుకుంటూ వో కిరణం సముద్రంపై. హరివిల్లు నెమలి పురివిప్పినట్టు వొక్కో రేకు విచ్చుకుంటోంది. సంపూర్ణంగా సుసంపన్నంగా సౌరభంతో వికసించిన కలువపువ్వు... ఆదిమగీతం వినిపిస్తోంది. దోసిళ్ళ పైన జలపాతం శిరస్సుపై మైదానాలు సరయూ నదీ తరంగాలు... సింధూ పరీవాహక ప్రాంతాలు... నైలు నదీ ప్రయాణాలు... కళ్ళని ఆవరించిన పొగమంచు అద్దం ముందు రూపం అస్పష్టంగా... కరుగుతున్న మంచుతెరలు స్పష్టమవుతున్న రూపం. క్రిస్టల్ క్లియర్ నగ్నదేహం... అరే యీ దేహం నాదే... యీ దేహమున్నట్టు యిన్నాళ్ళూ నాకు తెలియనేలేదు. కాదేమో యిది కొత్త దేహమేమో... గుర్తు రావటం లేదు... సకల ప్రపంచాన్ని మరచి పోయాను. నాకు తెలుస్తుంది యిప్పుడొక్కటే యేకమైన మనఃశ్శరీరాలు సుషుప్తి అణువణువుని విద్యుల్లతలా పెనవేసుకుపోతున్న దేహం. వొకే వొక్క సౌందర్యం. వొకే వొక్క ఆనందం. వెలుగు కనుక్కున్న సంబరం. వొకే వొక్క ఆనందం. వొకే వొక్క సౌందర్యం. రసైక జీవనానందం.

డిస్కవరీ - దేహ ప్రపంచాన్ని.

* * *

ఆకుపచ్చలోయల వెంట చిన్నిరైలు మెల్లమెల్లగా వెళుతోంది. పచ్చదనపు కొండల గుబురుల్లోంచి లోయల్లోకి కనుమరుగవుతున్న జలపాతాలు. మంచుతెరల వెనక మేఘమో వృక్షమో సూర్యకాంతో అంతా అస్పష్టమే. రైలు రైలంతా తిరుగు ప్రయాణపు బడలికలో యెనీమిక్‌గా.

నీలిమ కళ్ళ ముందు దృశ్యాలు వుత్సాహపు వుప్పెనలా పొంగిపోతున్నాయి.

♦